## జిట్టా బాలకృష్ణారెడ్డి మృతి తీరని లోటు

**సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావుగౌడ్**

సికింద్రాబాద్, సెప్టెంబర్ 6: తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ సీనియర్ నేత జిట్టా బాలకృష్ణారెడ్డి మృతి పట్ల సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావుగౌడ్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయనతో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్రం సాధనలో జిట్టా పాత్ర కీలకమైనదని కొనియాడారు. ఆయన మృతి పట్ల పద్మారావుగౌడ్ సంతాపం వ్యక్తం చేశారు.

## డిప్యూటీ మేయర్‌కు ఆహ్వానం



డిప్యూటీ మేయర్‌కు ఆహ్వానపత్రం అందజేస్తున్న నిర్వాహకులు

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 6: ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించి పూజలందుకుంటున్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనాలని డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డికి ఆహ్వానం అందింది. ఉత్సవ కమిటీ సభ్యులు తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ మేయర్ దంపతులకు ఆహ్వానపత్రాన్ని అందజేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు వీణ మాధురి సింగరి, రాజేంద్రన్, రాణా ప్రతాప్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారికి పూజలు

బేగంపేట్: సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ శుక్రవారం సాక సమర్పించారు. పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ పాలక మండలి మాజీ సభ్యులు మహిళా భక్తులతో కలిసి అమ్మవారికి సాక సమర్పించుకున్నారు.

# పర్యావరణ హిత ప్రతిమలే మేలు

- సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్
- పలు డివిజన్లలో పంపిణీ చేసిన కార్పొరేటర్లు
- మట్టి గణపతులను ప్రతిష్ఠిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం అంటూ చైతన్యం



మెట్టుగూడలో మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ రాసూరి సునీత



డిప్యూటీ కమిషనర్‌తో కలిసి మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తలసాని




చిలకలగూడ పార్క్ వద్ద మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ హేమ

బేగంపేట్, సెప్టెంబర్ 6: పర్యావరణ హితమైన మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. జీహెచ్‌ఎంసీ నార్త్ జోన్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య ఆధ్వర్యంలో మారేడ్‌పల్లిలోని తన నివాసంలో మట్టి ప్రతిమల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే తలసాని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రీయంగా మట్టితో తయారు చేసిన గణపతినే పూజించడం సంప్రదాయమని చెప్పారు. అందుకే ప్రతిఒకరు తమ ఇళ్లల్లో పూజలు చేసుకునేందుకు మట్టితో తయారు చేసిన గణపతినే తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి, బీఆర్ఎస్ నాయకులు కూతురు నర్సింహ, కట్టా బలరాం తదితరులు పాల్గొన్నారు.

### మట్టి ప్రతిమలనే ప్రతిష్ఠించాలి

అడ్డగుట్ట: మట్టి గణపతులను ప్రతిష్ఠించి పూజించాలని మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీతరమేశ్ అన్నారు. శుక్రవారం మెట్టుగూడలోని పలు ప్రాంతాల్లో ప్రజలకు మట్టి గణేశులను ఆమె పంపిణీ చేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ కలర్స్, కెమికల్స్‌తో తయారు చేసిన విగ్రహాలను ప్రతిష్ఠించడం ద్వారా పర్యావరణం కలుషితం అవుతుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, జీహెచ్‌ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

### మట్టి గణపతులే పర్యావరణానికి మేలు

అడ్డగుట్ట: తుకారాంగేట్ రియో పాయింట్ హోటల్ వద్ద కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్ ప్రజలకు మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు. మట్టి గణేశులతోనే పర్యావరణానికి మేలు జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గంటా రాజుసాగర్, జాఫర్, యూసుఫ్, ప్రభాకర్, రమేశ్, రామలీల, లలిత తదితరులు పాల్గొన్నారు.

### చిలకలగూడలో..

సికింద్రాబాద్: పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులనే పూజించాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ హేమ పిలుపునిచ్చారు. జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో మట్టి గణపతులను చిలకలగూడ పార్క్ వద్ద కార్పొరేటర్ పంపిణీ చేశారు. భవిష్యత్ తరాలకు కాలుష్య రహిత వాతావరణం కల్పించడం, పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యతన్నారు. అనంతరం చిలకలగూడ పార్క్‌లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో రవి, శంకర్, మేరు సంఘం సభ్యులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడు మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో కట్ట మైసమ్మ, పోచమ్మ ఆలయం వద్ద మట్టి గణపతులు పంపిణీ చేశారు. సికింద్రాబాద్ పార్టీ ఇన్‌చార్జి అదం సంతోష్ ముఖ్యఅతిథిగా విచ్చేసి భక్తులకు అందజేశారు. సీనియర్ నాయకులు అమర్నాథ్‌గౌడ్, పాపాలాల్, కృష్ణ పాల్గొన్నారు.



పద్మారావునగర్ పార్కు వద్ద పవన్‌కుమార్, ఏసూరి మహేశ్, వెంకటేశన్ రాజు, గజ్జెల శ్రీను, శ్రీకాంత్‌రెడ్డి – బన్సీలాల్‌పేట్



చిలకలగూడ కట్ట మైసమ్మ ఆలయం వద్ద...



అడ్డగుట్టలో మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న ఆదం సంతోష్‌కుమార్

## అమరుడు కట్టెలమండి కృష్ణకాంత్ యాదిలో..




తెలంగాణ ఉద్యమకారుడు కట్టెలమండి కృష్ణకాంత్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు

బొల్లారం, సెప్టెంబర్ 6: కంటోన్మెంట్ రెండో వార్డు పరిధిలోని రసూల్‌పురాలో శుక్రవారం తెలంగాణ ఉద్యమకారుడు కట్టెలమండి కృష్ణకాంత్ 11వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమరుడు కృష్ణకాంత్ విగ్రహానికి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియకుడు దేవులపల్లి శ్రీనివాస్, వార్డు అధ్యక్షుడు కుమార్ ముదిరాజ్, ఉస్మాన్, ధన్‌రాజ్, హేమలత, చంద్రకాంత్, సీతారాంరాజు, సత్యనారాయణ, రాజేశ్, రమేశ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.







# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



తిరుమలగిరి గంగయ్య బస్తీలో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

బొల్లారం, సెప్టెంబర్ 6: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిరంతరం కృషి చేస్తానని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. శుక్రవారం ఏడో వార్డు పరిధిలోని గంగయ్య బస్తీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బస్తీవాసులు నాలా సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. బస్తీలో నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే బస్తీలో నెలకొన్న సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జూలీస్ సంతోష్, శ్రీనివాస్, సాయికుమార్, మురళీ ముదిరాజ్, సుధీర్‌కుమార్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# దోమల నివారణపై అవగాహన ర్యాలీ




వైద్యశిబిరంలో పాల్గొన్న డాక్టర్ డి.ప్రశాంతి, సిబ్బంది

బన్సీలాల్‌పేట్, సెప్టెంబర్ 6: జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో ఫ్రైడే–డ్రైడేలో భాగంగా శుక్రవారం దోమల నివారణ చర్యలపై బోయిగూడ బస్తీల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వకుండా జాగ్రతలు తీసుకోవాలని గాంధీ ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి.ప్రశాంతి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

## సమస్యలు పర్కిష్కరించాలి

సికింద్రాబాద్, సెప్టెంబర్ 6: జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్–29 ఎస్ఎఫ్ఏ కార్మికులు ఎమ్మెల్సీ కోదండరాంను మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం తార్నాకలోని ఆయన నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. తమ సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరారు. అలాగే తమకు పెట్రోల్ టోకెన్లను ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ సూపర్‌వైజర్ బానోతు రమేశ్, నాగేశ్, సురేశ్ పాల్గొన్నారు.

## రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

మారేడ్‌పల్లి, సెప్టెంబర్ 6: ప్రయాణికుల్లా నటిస్తూ రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. మరో నిందితుడు పరారీలో ఉన్న సంఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నిందితుడి నుంచి రూ.21 లక్షల 60వేలు, 30 తులాల బంగారు ఆభరణాలను రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రైల్వే డీఎస్పీ ఎస్ఎన్ జావేద్, ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ వివరాల ప్రకారం హర్యానాకు చెందిన సుల్తాన్ (44), జోగిందర్ (35) వ్యవసాయదారులు. జల్సాలకు అలవాటు పడి రైళ్లలో దొంగతనాల బాట పట్టారు. నాగోల్ ప్రాంతానికి చెందిన ఎన్వీ రవిశంకర్ తన కుమారుడి పెండ్లి అనంతరం విశాఖపట్నంలో ఆగస్టు 28న కుటుంబీకులతో నాందేడ్ ఎక్స్‌ప్రెస్ రైల్లో బయలుదేరారు. 29న తెల్లవారుజామున సికింద్రాబాద్‌కు రైలు చేరుకుంది. బెర్త్‌ల కింద బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులు కనిపించకపోవడంతో రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న రైల్వే పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈనెల 1న రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితుడు సుల్తాన్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా చేసిన నేరాన్ని అంగీకరించాడు. మరో నిందితుడు జోగిందర్ పరారీలో ఉన్నట్టు పోలీసులు వెల్లడించారు.

# నిందితుడిని తక్షణమే ఉరి తీయాలి



ఆర్ట్స్ కళాశాల ఆవరణలో విలేకరుల సమావేశంలో నినదిస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 6: ఆదివాసీ మహిళపై అత్యాచార యత్నానికి పాల్పడిన నిందితుడిని తక్షణమే ఉరితీయాలని ఆదివాసీ విద్యార్థి సంఘం (ఏఎస్ఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. ఆదివాసీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలో ఆదివాసీ మహిళపై జరిగిన ఘటనను నిరసిస్తూ ఏఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ హత్యాయత్నానికి ప్రయత్నించిన ఆటోడ్రైవర్ షేక్ ముగ్దుమ్‌ను ప్రభుత్వం ఉరితీయాలని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసులు ప్రత్యేకమైన చట్టాలు ఉన్నాయని గుర్తు చేశారు. ఆ చట్టాలను అమలు చేయాలని కోరారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి నిందితుడికి ఉరిశిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకొని, బాధిత మహిళకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. లేనిపక్షంలో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గొంది వెంకటరమణ, ఏఎస్ఎఫ్ ఓయూ అధ్యక్షుడు మడావి అజయ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కళ్యాణ్, ప్రధాన కార్యదర్శి ఈసం నాగరాజు, కల్చరల్ సెక్రెటరీ జవ్వాజి దివ్య, కోశాధికారి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఖర్గేకు కృతజ్ఞతలు తెలిపిన పీసీసీ నాయకులు



ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు కృతజ్ఞతలు తెలుపుతున్న పీసీసీ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 6: కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించిన బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను పీసీసీ అధ్యక్షునిగా నియమించడం పట్ల టీపీసీసీ నాయకులు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు కృతజ్ఞతలు తెలిపారు. ఢిల్లీలో ఆయనను కలిసిన అనంతరం జైగౌడ్ ఉద్యమం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వట్టికూటి రామారావుగౌడ్ మాట్లాడుతూ 40 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి మహేశ్ కుమార్‌గౌడ్ ఎంతగానో పాటుపడ్డారని కొనియాడారు. బడుగు బలహీనవర్గాల ప్రతినిధిగా ఆయన పార్టీ బలోపేతానికి కృషి చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ నాయకులు మాదు సత్యంగౌడ్, హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.రామన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న టీటీఐ ఏసీపీ శంకర్ రాజు

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 6: మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, అందుకు కఠిన చర్యలు తప్పవని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (టీటీఐ) ఏసీపీ జి.శంకర్‌రాజు అన్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. లాలాపేటలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు రోడ్డు ప్రమాదాలు–నివారణ అంశంపై శుక్రవారం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు నడిపేందుకు ఇస్తే వారి తల్లిదండ్రులతో పాటు యజమానికి జైలుశిక్ష పడే అవకాశం ఉందని చెప్పారు. రూ.25 వేల జరిమానాతో పాటు వాహన రిజిస్ట్రేషన్ సైతం రద్దు కానుందన్నారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. రోడ్‌క్రాస్ చేసేటపుడు జీబ్రాలైన్ వద్ద మాత్రమే క్రాస్ చేయాలని సూచించారు. లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేస్తే జరిమానాతో పాటు మూడు నెలల జైలు శిక్ష ఎదుర్కొంటారని హెచ్చరించారు. వాహనం నడిపేటపుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ ప్రతాప్‌రెడ్డి, వెంకటప్రసాద్, టీటీఐ బేగంపేట అధికారులు పాల్గొన్నారు.

# మట్టి విగ్రహాలను పంపిణీ చేసిన కార్పొరేటర్




మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ కంది శైలజ

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 6: వినాయకచవితి నేపథ్యంలో మట్టి విగ్రహాలనే పూజించాలని బౌద్ధనగర్ కార్పొరేటర్ కంది శైలజ సూచించారు. తద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని చెప్పారు. బౌద్ధనగర్ డివిజన్ వార్డు కార్యాలయంలో కంది శైలజ మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీవోపీ విగ్రహాల ద్వారా పర్యావరణానికి హాని జరుగుతుందని చెప్పారు. తద్వారా వాతావరణంలో విపరీతమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. ఇది చివరికి మానవాళి వినాశనానికి దారి తీస్తుందని అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఉద్యోగులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ఫిజియోథెరపితో ఉపశమనం

అమీర్‌పేట్, సెప్టెంబర్ 6: వయోభారం కారణంగా చాలామందిలో కనిపించే దీర్ఘకాలిక నొప్పుల నివారణకు ఫిజియోథెరపి చక్కటి మార్గమని గ్లోబల్ చైల్డ్ డెవల్‌మెంట్ సెంటర్ నిర్వాహకుడు, ప్రముఖ ఫిజియోథెరపిస్ట్ తరిగొప్పుల నాగరాజు తెలిపారు. ఈనెల 8న అంతర్జాతీయ ఫిజియోథెరపిస్ట్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్ఆర్‌నగర్‌లోని సంస్థ కార్యాలయంలో అవగాహన కల్పించారు. నాగరాజు మాట్లాడుతూ జన్యుపరమైన లోపాలతో ఉండే చిన్నారుల్లో తలెత్తే వెన్నుముక గాయాలు, తక్కువ బరువుతో జన్మించే పిల్లల్లో ఎదుగుదల ఆలస్యం, పాక్షిత పక్షవాతం, శ్వాస్వకోశ సమస్యలతో పాటు సరిగ్గా నడవలేకపోవడం, భాషను వ్యక్తం చేయలేకపోవడం, అర్థం చేసుకోలేకపోవడం వంటి సమస్యలకు నిపుణుల నేతృత్వంలో జరిగే మానసిక, భౌతిక వ్యాయామాల వల్ల ప్రయోజనం ఉంటుందన్నారు. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న ఫిజియోథెరపి కోర్సు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో లేకపోవడం విచారకరమన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఫిజియోథెరపిస్టులను రోగులకు అందేబాటులో ఉండేలా చూడాలని ప్రభుత్వానికి విన్నవించనున్నట్టు ఆయన వెల్లడించారు.

## డిప్యూటీ మేయర్‌ను కలిసిన వెటర్నరీ అధికారులు



డిప్యూటీ మేయర్‌కు మొక్కను అందజేస్తున్న వెటర్నరీ డాక్టర్ మారుతి

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 6: సికింద్రాబాద్ నియోజకవర్గం తార్నాక డివిజన్ నూతన వెటర్నరీ ఆఫీసర్‌గా నియమితులైన డాక్టర మారుతి నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయానికి శుక్రవారం వచ్చిన ఆయన డిప్యూటీ మేయర్‌కు మొక్కను అందజేశారు. ఈసందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి, వెటర్నరీ ఏడీ సద్గుణాదేవి తదితరులు పాల్గొన్నారు.